నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



టీడీపీ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన నిరుద్యోగ భృతిని వెంటనే ఇవ్వాలి. నిరుద్యోగులను ఆదుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు గడిచినా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై దృష్టి పెట్టక పోవడం విడ్డూరంగా ఉంది. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం నెలకు మూడు వేల రూపాయలు క్రమం తప్పకుండా ప్రతి నెలా ఇవ్వాలి. మాట నిలబెట్టుకొని నెల నెలా నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే నిరుద్యోగులు ఎక్కడికక్కడ నిలదీసేందుకు సిద్ధమయ్యారు.

– భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, బీఎస్సీ, ఎల్ఎల్‌బీ, తూర్పుగంగవరం, తాళ్లూరు మండలం

నిరుద్యోగ భృతి అందించాలి:



నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఉపాధికి తగిన అవకాశాలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం. తప్పని సరిగా నిరుద్యోగులను ఆదుకునేందుకు ఈ పథకాన్ని సూపర్ సిక్స్‌లో భాగంగా అమలు చేయాలి. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి పథకాలను అందించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

– ఎం.యశ్వంత్, గ్రాడ్యుయేట్, త్రిపురాంతకం

చంద్రబాబు అబద్ధాలకోరని మళ్లీ నిరూపించుకున్నాడు



పోయినసారి రైతు రుణమాఫీ, పసుపు కుంకుమ పేరుతో మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు తల్లికి వందనం పేరుతో మోసం చేశాడు. తన బతుకంతా మోసాలేనని నిరూపించుకున్నాడు. బడులు తెరిచి నాలుగు నెలలు గడుస్తున్నా తల్లికి వందనం పథకం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. అవి ఇస్తే పిల్లలకు ఫీజులు కట్టుకోవచ్చని ఎదురు చూస్తున్నాం.

– బత్తుల వెంకటలక్ష్మి, బోధనంపాడు, కురిచేడు మండలం

నమ్మించి నట్టేట ముంచాడు



ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేల ప్రకారం ఇస్తామని ఎన్నికల ముందు చెప్పారు. ఎన్నికల తర్వాత మాట మార్చి ఈ ఏడాది ఇచ్చేది లేదని చెప్తున్నారు. ప్రైవేటు బడికి పంపిస్తే ఫీజులు కడతారా లేదా అని యాజమానులు నిలదీస్తున్నారు. ఎంతకాలం వారు ఊరక చెబుతారు. తల్లికి వందనం ఎప్పుడిచ్చినా ప్రైవేటు స్కూల్లో ఫీజులు అడగకుండా చేయమనీ చాలు. జగనన్న ప్రభుత్వం వచ్చిన వెంటనే అమ్మఒడి నగదు జమ చేశారు.

– ఇందూరి దేవి, కురిచేడు

బడిలో ఫీజు కట్టమని ఇబ్బంది పెడుతున్నారు:



ఐదేళ్లుగా అమ్మ ఒడి ఠంఛన్‌గా ఇచ్చారు. మా పిల్లలకు ఇబ్బంది లేకుండా ఫీజులు కట్టి చదివించుకున్నాం. ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదు. బడిలో ఫీజు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారు. వాళ్ల పదవుల కోసం పిల్లల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. వెంటనే తల్లికి వందనం డబ్బులు ఇవ్వాలి. లేదంటే స్కూల్లో ఫీజులు లేకుండా చదువులు చెప్పించాలి.


– ఆసుపల్లి మహాలక్ష్మి, గంగదొనకొండ, కురిచేడు మండలం

నెలకు రూ.1500 ఇస్తే ఒక పూటన్నా అన్నం తింటా



చంద్రబాబు నెలకు 1500 ఇస్తామన్నాడని ఆశతో ఓట్లు వేశాం. ఇంతవరకు ఆ డబ్బులు ఎప్పుడిచ్చేది చెప్పడం లేదు. ఆ డబ్బులు వస్తే ఒక పూట గడుస్తుందని ఆశపడ్డాను. ఇక్కడి నాయకులు త్వరగా ఆ డబ్బులు తెప్పించి ఇస్తే ఆయన పేరు చెప్పుకుంటాం. పోయిన సారి జగన్ చెప్పినవన్నీ ఇచ్చాడు. ఈయన కూడా అలానే ఇస్తాడనుకున్నాం. కానీ ఇవ్వలేదు. త్వరగా ఆ డబ్బులు ఇవ్వాలి.

– కోలా లక్ష్మి, గంగదొనకొండ, కురిచేడు మండలం



పోయాం..మోసం!

సూపర్ సిక్స్ కాదు..డకౌట్

- హామీల అమలుకు ప్రజల ఎదురు చూపులు
- మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే
- మోసపోయామని ఆవేదన చెందుతున్న ప్రజలు

దర్శి/యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్‌లోని పథకాలన్నీ అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఓట్లు కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, ప్రస్తుత మంత్రి లోకేష్‌లు పేద ప్రజలను నమ్మబలికారు. అమలు చేయలేమని తెలిసే అధికారం కోసం అబద్ధపు హామీలు వల్లెవేశారు. తాను గతంలోలా కాదని, మారిపోయానని కచ్చితంగా హామీలు అమలు చేస్తామని నమ్మబలికారు. చంద్రబాబు తాన..అంటే పవన్‌కళ్యాణ్ తందానా.. అన్నారు. ఓట్లేసి గెలిపించండి.. పథకాలు అమలు చేయించే బాధ్యత తనదని పవన్ కళ్యాణ్ నమ్మబలికారు. చెప్పిందే పదే పదే చెప్పి అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు. ఇప్పుడు సూపర్‌సిక్స్‌లో ఒక్క పథకం కూడా అమలు చేసే యోచనలో ప్రభుత్వం కనిపించడం లేదు. చంద్రబాబుకు ఓట్లేసి మోసపోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
అమ్మఒడి	దర్శి	రూ.43,37
	యర్రగొండపాలెం	రూ.47.19




టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

దర్శి	-	60,000
యర్రగొండపాలెం	-	32,000
ఇవ్వాల్సిన సాయం	-	రూ. 136(కోట్లు)

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం



పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
రైతు భరోసా	దర్శి	రూ. 59.90
	యర్రగొండపాలెం	రూ. 55.30

టీడీపీ పాలనలో ఒక్కో ఎడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

దర్శి	-	44,372
యర్రగొండపాలెం	-	40,743
ఇవ్వాల్సిన సాయం	-	రూ.170.23(కోట్లు)



యువతకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

దర్శి నియోజకవర్గం : 30,000
వైపాలెం నియోజకవర్గం : 20,000
నెలకు ఇవ్వవలసిన సాయం : రూ.15కోట్లు



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

దర్శి నియోజకవర్గం : 90,000
వైపాలెం నియోజకవర్గం : 89,863
నెలకు ఇవ్వవలసిన సాయం : రూ.26.97కోట్లు



ప్రతి ఇంటికి 3గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

దర్శి : 76,460
చేయాల్సిన ఖర్చు : రూ.20,18,54,400
వైపాలెం : 84,403
చేయాల్సిన ఖర్చు : రూ.22,28,23,920



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

దర్శి నియోజకవర్గం : 1,50,000
వైపాలెం నియోజకవర్గం : 1,042,22

రూ.60 వేలు వస్తాయని ఆశతో ఉన్నా:



నాకు ఆరుగురు పిల్లలు. వారిలో నలుగురు ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. గత సంవత్సరం అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు నా అకౌంట్‌లో జమ అయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత బడికి వెళ్లే ఒక్కో బిడ్డకు తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ప్రకారం నా అకౌంట్‌లో రూ.60 వేలు జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు దానిపై ఎటువంటి సమాచారం లేదు. నాకు డబ్బులు వస్తాయా? లేదా?

– టి.కాశమ్మ, కూలీ, యర్రగొండపాలెం

మహిళలను తొందరగా మోసం చేయవచ్చనుకున్నాడేమో:



మహిళలైతే ఏం చెప్పినా నమ్ముతారు.. త్వరగా మోసం చేయవచ్చని ఈ పనిచేశారు. ఓట్లకు వచ్చినప్పుడు తియ్యటి మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేశారు. మా ఉసురు తప్పకుండా తగులుద్ది. ఆడవాళ్లను మోసం చేసిన వాళ్లు బాగు పడలేదు. జగన్ ప్రభుత్వంలో ఇస్తామన్నవి ఇచ్చారు. మోసం చేయలేదు.

– కురిచేటి రమణమ్మ, పొట్లపాడు, కురిచేడు మండలం

పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చేర్పించా:



అమ్మకు వందనం వస్తుందని నా ముగ్గురు పిల్లలను ప్రైవేటు స్కూల్లో చేర్పించా. జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు ఇచ్చారు. ఇప్పుడు అమ్మకు వందనం కింద ముగ్గురు పిల్లలకు కలిపి రూ.45 వేలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బులు గురించి కూటమి ప్రభుత్వం నోరెత్తడం లేదు. వచ్చే ఏడాది నుంచి పథకం అమలు చేస్తామని టీడీపీ నాయకులు అంటున్నారు. ఈ సంవత్సరం నా పిల్లలను ఏ విధంగా చదివించుకోవాలి. అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చేర్పించా. ఆ అప్పులు తీరే మార్గం కనిపించడం లేదు.

– ఆర్.బుజ్జిబాయి, గృహిణి, పాతచెరువు తండా, పుల్లలచెరువు

అన్నదాతా సుఖీభవ ఎప్పుడు అమలు చేస్తారు:



పంటల సాగుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకం గురించి కొత్త ప్రభుత్వం ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్లో పంటల సాగు ప్రారంభమైంది. ఇప్పటికే పత్తి, కంది, పొగాకు, తదితర పంటలు సాగు చేసుకున్నాం. గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఈ పాటికి మాకు రైతు భరోసా ఇచ్చారు. పంటల పెట్టుబడికి అప్పులు చేయకుండా ఏటా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులపై చిన్న చూపు చూస్తోందని అర్థమవుతోంది.

– మూల కొండారెడ్డి, రైతు, పెద్దారవీడు

సిలిండర్ల కోసం ఎదురు చూస్తున్నాం



సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా మహిళలకు ఉచితంగా ఇస్తామన్న మూడు గ్యాస్ సిలెండర్ల కోసం ఎదురు చూస్తున్నాం. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేస్తూ వీలైనంత త్వరగా గ్యాస్ సిలిండర్లు మహిళలకు అందజేయాలి. ఈ ఏడాది ఇవ్వలేమని చెప్పడం సమంజసం కాదు. ఎన్నికల హామీలను నెలబెట్టుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉంది. లేకుంటే భవిష్యత్‌లో కూటమి నాయకుల మాటలు నమ్మే పరిస్థితి లేదు.

– జి.వీరాంజమ్మ, బొప్పూడివారిపాలెం, ముండ్లమూరు మండలం

ఉచిత బస్సు ఉత్తి మాటేనా:



ఎన్నికల సమయంలో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం ఉత్త మాటగానే కనిపిస్తోంది. గద్దెనెక్కి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు దాని ప్రస్తావనే లేదు. హామీ ఇచ్చారు అంటే చేయాలి, అంతేగానీ ప్రజలను మభ్యపెట్టడానికి అమలు చేయటానికి చేతకాని హామీలు ఇవ్వడం సిగ్గుచేటు.

– ఎల్.నాగమ్మ, మాజీ సర్పంచ్, పుల్లలచెరువు

మూడు గ్యాస్ సిలిండర్లు ఏవి:



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని కూటమి అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి యాభై రోజులు దాటిపోతున్నా ఇంత వరకు ఉచితంగా ఇస్తామన్న గ్యాస్ సిలిండర్లు పంపిణీ కాలేదు. ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తాదని ఎదురు చూస్తున్నాం. ప్రజలను మభ్య పెట్టకుండా వెంటనే సిలిండర్లు పంపిణీ చేయాలి.

– శాంతమ్మ, అంబేడ్కర్ కాలనీ, త్రిపురాంతకం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



తీవ్ర గాయాలతో నాగేశ్వరరావు

పెద్దారవీడు: మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో తోకపల్లి సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పాతంపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు మార్కాపురం పట్టణంలో సొంత పనులు ముగించుకొని తిరిగి మోటార్ సైకిల్‌పై పోతున్నారు. తోకపల్లి గ్రామం సమీపంలోకి రాగానే మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రోయిలింగ్‌ను ఢీకొట్టడంతో చేయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేయగా క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌కు పునాది

పెద్దారవీడు: విద్యార్థి దశ నుంచే తమ భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు ఎం.రామభూపాలరెడ్డి కోరారు. మండల కేంద్రం పెద్దారవీడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2023–24 సంవత్సరం మార్చి నెలలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రథమ, ద్వితీయ స్థాయి పొందిన బాలికలకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాలికలు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి అధిరోహించాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఎంఈఓ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ పేద విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్ కోసం రామభూపాలరెడ్డి సేవలు కొనియాడారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆవార్డు అందుకున్న రామభూపాలరెడ్డి మన విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉండాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించేందుకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. పీబే, ఉపాధ్యాయురాలు, బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలకు జ్ఞాపికలు అందిస్తున్న విశ్రాంత హెచ్‌ఎం రామభూపాలరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు

యూటీఎఫ్ క్రీడలు అభినందనీయం

దర్శి: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చందలూరు పీడీ సోము అంజిరెడ్డి అన్నారు. స్థానిక ఆ పాఠశాలలో షటిల్ బ్యాట్ ఆటలో మొదటి స్థానం సాధించిన చందలూరు హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు వై.మారుతికిరణ్‌రెడ్డి, తానంచింతల పాఠశాల ఉపాధ్యాయులు కె.విజయ్ భాస్కర్‌లను చందలూరు హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సందు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపారని చెప్పారు. అనంతరం విజేతలకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి, దర్శి ప్రధాన కార్యదర్శి పి.ఖాసీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో ఇంగ్లిష్ బోధించాలి

పుల్లలచెరువు: విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులు కాంప్లెక్సులో నేర్చుకున్న అంశాలను అర్థం చేసుకుని సులభ పద్ధతిలో బోధన చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో బుధవారం కాంప్లెక్సు సమావేశం హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎంఈవో శామ్యూల్‌జాన్ మాట్లాడుతూ పాఠశాలలో ఎప్పటికప్పుడు సిలబస్ ప్రకారం బోధిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో కూడా విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికర భోజనం అందజేయాలన్నారు. కాంప్లెక్సు నేర్చుకున్న అంశాలను ప్లాన్ చేసుకుని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యా కార్యక్రమాల ద్వారానే బోధన చేయాలని పేర్కొన్నారు. కాంప్లెక్సు పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కంభం సీఐ

కంభం: కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.మల్లిఖార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ జె.రామకోటయ్యను గిద్దలూరు రూరల్‌కు బదిలీ చేసి, నరసరావుపేట రూరల్ సీఐ మల్లికార్జునను కంభంలో నియమించారు. నూతన సీఐని పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.